మౌలిక వసతులు కరువు

- సమస్యలకు కేరాఫ్‌గా మారిన కామారెడ్డి ఆర్టీసీ బస్టాండ్
- గుక్కెడు తాగునీటికి ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సిందే
- కంపుకొడుతున్న మూత్రశాలలు
- గుంతలమయంగా ప్రాంగణం
- పట్టించుకోని అధికారులు


కంపుకొడుతుండటంతో ముక్కు మూసుకుంటున్న మహిళలు


కామారెడ్డి ఆర్టీసీ బస్టాండ్‌లో చెడిపోయిన తాగునీటి నల్లాలు

కామారెడ్డి టౌన్: ఆర్టీసీలో మహిళల ఉచిత ప్రయాణం పథకంతో డిపో కాస్త లాభాల బాటలో పడింది. కాసులు బాగానే వస్తున్నా బస్టాండ్‌లో ప్రయాణికులకు మాత్రం కనీస మౌలిక వసతులను కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలం అవుతున్నారు. వెరసి కామారెడ్డి బస్టాండ్‌లో సమస్యలతో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు.

కామారెడ్డి ఆర్టీసీ డిపోలో 118 బస్సులు ఉండగా, నిత్యం లక్షకుపైగా ప్రయాణికులు బస్సుల్లో ప్రయాణాలు సాగిస్తారు. డిపోకు నిత్యం రూ.26 లక్షలకు పైగా ఆదాయం సమకూరుతుంది. కామారెడ్డి ఆర్టీసీ డిపోలో కనీస మౌలిక వసతులు లేక ప్రయాణికుల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్ ఆవరణలో ప్రయాణికులకు తాగునీరు సౌకర్యాన్ని ఆర్టీసి అధికారులు ఏర్పాటు చేయలేదు. బస్టాండ్ ఎంట్రెన్స్‌లో ఉన్న తాగునీటి నల్లాలు ధ్వంసమయ్యాయి. కూలింగ్ వాటర్ యంత్రం చెడిపోయి వృథాగా ఉంది. ఎండల తీవ్రత పెరగడంతో ప్రయాణికులు ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు గుక్కెడు తాగునీటి కోసం నానా తంటాలు పడుతున్నారు. కొందరు డబ్బులు వెచ్చించి దాహం తీర్చుకుంటున్నారు.

వ్యాపారుల ప్రయోజనాల కోసం..

బస్టాండ్‌లోని వ్యాపారుల వద్ద నీటి బాటిళ్లను అమ్ముడుపోవాలని ఉద్దేశంతో బస్టాండ్‌లో ఉచిత తాగునీరు సౌకర్యం ఏర్పాట్లు చేయడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. నూతన షెడ్ల వద్ద స్త్రీల కోసం ఏర్పాటు చేసిన ఉచిత మూత్రశాలలకు తాళం వేసి ఉంచారు. అలాగే బస్టాండ్ ప్లాట్‌ఫాంపై ఉన్న ఉచిత మరుగుదొడ్లు, మూత్రశాలలు కంపుకొడుతుండటంతో ప్రయాణికులు ముక్కులు మూసుకుంటున్నారు. బస్టాండ్ చుట్టూ ఉన్న ప్రహరీల వద్ద మూత్రం విసర్జిస్తున్నారు. పే అండ్ యూజ్ మూత్రశాలల నిర్వాహకులు అధికంగా డబ్బులు వసూలు చేయడమే ఈ పరిస్థితికి కారణం. పార్కింగ్ నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా వాహనదారుల నుంచి డబ్బులు దండుకుంటున్నారు. బస్సులు లోపలికి, బయటకు వెళ్లే దారితో పాటు లోపల భారీగా గుంతలు ఏర్పడ్డాయి. ప్లాట్‌ఫాంలపై సరిపడా కుర్చీలు లేక ప్రయాణికులు గంటల తరబడి నిల్చుంటూ అవస్థలు పడుతున్నారు. ఉన్న 8 సీసీ కెమెరాలు పూర్తి స్థాయిలో పని చేయడం లేదు. తరుచూ దొంగతనాలు జరుగుతున్నా దొంగలను గుర్తించడం సాధ్యం కావడం లేదు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సమస్యలను పరిష్కరిస్తాం

డిపోలో ఉన్న సమస్యలను త్వరగా పరిష్కరిస్తాం. తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేస్తాం. మరుగుదొడ్లు, మూత్రశాలల సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నాం. బస్టాండ్ ఆవరణలో గుంతలు పూడ్చడంతోపాటు, సీసీ రోడ్డు కోసం ఉన్నతాధికారులకు నివేదించాం. ఇంకా ఏమైనా సమస్యలుంటే కాగితంపై రాసి ఫిర్యాదు పెట్టెలో వేస్తే పరిష్కరిస్తాం.

– ఇందిర, డిపో మేనేజర్, కామారెడ్డి

తీన్మార్ మల్లన్నపై ఫిర్యాదు

బాన్సువాడ: ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై శుక్రవారం బాన్సువాడ పోలీస్ స్టేషన్‌లో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో సీఐకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రెడ్డి సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాసాని అశోక్‌రెడ్డి, పాశం రాజిరెడ్డిలు మాట్లాడుతూ.. వరంగల్ సభలో, వివిధ మాధ్యమాలలో కొంత కాలంగా రెడ్డి కులస్తులపై తీన్మార్ మల్లన్న చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. రాజకీయ లబ్ధి కోసమే రెడ్డిలను కించపర్చే విధంగా మాట్లాడుతున్నారని, చట్టపరంగా మల్లన్నపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెడ్డి సంఘం సభ్యులు ర్యాల నర్సింహారెడ్డి, లక్ష్మారెడ్డి, మాసాని రవీందర్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, హన్మంత్ రెడ్డి, గంగారెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నాగిరెడ్డి తదితరులున్నారు.


ఫిర్యాదు చేస్తున్న రెడ్డి సంఘం నాయకులు

సమాచారం..

10న ప్రజా సంఘాల మహాధర్నా



బాన్సువాడ: ఈ నెల 10న ప్రజా సంఘాల మహాధర్నా నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా నాయకులు రవీందర్ అన్నారు. శుక్రవారం బాన్సువాడలో ఆయన మాట్లాడారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ ఈ నెల 10న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మహా ధర్నా చేపట్టినట్లు తెలిపారు. మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షుడు బుజ్జిగారి సాయిలు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బాన్సువాడ రూరల్: ఇబ్రహీంపేట్ గ్రామ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో బాన్సువాడ రూరల్ ఏఈ అనిల్‌కుమార్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నామన్నారు. అలాగే తాడ్కోల్, హన్మాజీపేట్ ఉపకేంద్రాల పరిధిలోనూ సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు సరఫరా నిలిపేయనున్నట్లు చెప్పారు.

సదాశివనగర్ పరిధిలో..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ చేపడుతున్న నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ గంగాధర్ తెలిపారు. కొత్త స్తంభాల ఏర్పాటు, లైన్ మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకు కరంట్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు పేర్కొన్నారు.

మొక్కలు ఎండకుండా చర్యలు తీసుకోవాలి



ఎల్లారెడ్డిరూరల్: బ్రాహ్మణపల్లిలో శుక్రవారం వాటరింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి శుక్రవారం వాటరింగ్‌డేలో భాగంగా మొక్కలకు నీరు పోయాలని, కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో మన్నె ప్రభాకర్ మొక్కలకు నీరు పోశారు. నర్సరీలలో మొక్కలు ఎండకుండా తగిన చర్యలు తీసుకోవాలని పంచాయతి కార్యదర్శికి సూచించారు. ఎంపీవో ప్రకాష్ తదితరులున్నారు.

నీటి ఎద్దడి తీర్చాలని వినతి



భిక్కనూరు: మండల కేంద్రంలోని శ్రీరాంనగర్ కాలనీలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఆర్‌టీఐ జిల్లా ప్రతినిధి గంగళ్ల రవీందర్, మండల ప్రతినిధి నాగరాజులు గ్రామ పంచాయతీ ఈవో మహేశ్‌గౌడ్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. వేసవి కాలం రాకముందే నీటి ఎద్దడి ఈ కాలనీలో తీవ్రంగా ఉందని, ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురి అవుతున్నారని, వెంటనే చర్యలు తీసుకుని నీటి ఎద్దడి లేకుండా చూడాలని వారు వినతి పత్రంలో కోరారు.

పిల్లల ఎదుగుదలకు పోషకాహారం తప్పనిసరి

లింగంపేట(ఎల్లారెడ్డి): పిల్లల ఎదుగుదలకు పోషకాహారం తప్పనిసరి అని టీవోటీ జగదీశ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల సమాఖ్య కార్యాలయంలో గ్రామ సంఘాల సభ్యులకు పోషకాహార పద్ధతులపై సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పిల్లల్లో ఎదుగుదలకు గర్భధారణ నాటి నుంచి మొదటి 1000 రోజులు ఎంతో కీలకం అన్నారు. ఇందుకోసం ఎస్ఐఆర్‌డీపీఆర్, యూఎస్ఐసీఈఎఫ్, సెర్ప్ సంస్థలు కలిసి ఎస్‌హెచ్‌జీ మహిళల కుటుంబాలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు. పోషణ లోపాన్ని సాధారణ ఆరోగ్యం, పోషకాహార పద్ధతులను పాటించి పరిష్కరించవచ్చన్నారు. ఏపీఎం శ్రీనివాస్, సీసీ మెహర్, తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న టీవోటీ జగదీశ్ కుమార్

సఖి కేంద్రం పరిశీలన

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని సఖి కేంద్రాన్ని కామారెడ్డి ఏఎస్పీ చైతన్యారెడ్డి శుక్రవారం రాత్రి పరిశీలించారు. కేంద్రంలోని సౌకర్యాలు, రికార్డులను పరిశీలించారు. బాధిత మహిళలకు అందుతున్న సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. కేంద్రం ఇన్‌చార్జి భారతి, సిబ్బంది పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న ఏఎస్పీ చైతన్యారెడ్డి

మోడల్ స్కూల్‌లో మాక్ పోలింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో శుక్రవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజిరెడ్డి మాట్లాడుతూ.. మాక్ పోలింగ్ ద్వారా ఎన్నికలు జరిగే విధానానికి సంబంధించిన విషయాల గురించి విద్యార్థులకు అవగాహన వస్తుందన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

బీబీపేట: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీవో అబ్బాగౌడ్ అన్నారు. శుక్రవారం జనగామలో తాగునీటి కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధులు తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉన్న నీటి తొట్టెలను శుభ్రం చేయించారు. కార్యదర్శి కాశి కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

న్యాయ చైతన్య సదస్సు



కామారెడ్డి టౌన్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ శుక్రవారం జిల్లా కేంద్రంలోని బాలసదనంలో న్యాయచైతన్య సదస్సు నిర్వహించారు. సంస్థ కార్యదర్శి, జిల్లా న్యాయమూర్తి నాగరాణి, చిన్నారులకు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బాల సదనం అధికారిణి సంగమేశ్వరి, అథ్లెటిక్ కోచ్ శివ గౌడ్, సిబ్బంది శోభన్ నాయక్, సంస్థ సిబ్బంది శ్రావణ్, సాయిప్రణీత్ పాల్గొన్నారు

వంద శాతం పన్నులు వసూలు చేయాలి



బిచ్కుంద(జుక్కల్): గ్రామ పంచాయతీ కార్యదర్శులు వంద శాతం పన్నులు వసూలు చేయాలని ఎంపీడీవో గోపాల్ అన్నారు. శుక్రవారం పెద్దతక్కడ్‌పల్లి గ్రామ పంచాయతీ సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. ప్రజలు పన్ను చెల్లించి గ్రామ అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు.

మున్నూరు కాపు కార్యవర్గం



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలం తుంకిపల్లి గ్రామంలో బుధవారం మున్నూరుకాపు మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లింగాల శంకర్ పటేల్, గౌరవ అధ్యక్షుడిగా బీమన్‌పల్లి లక్ష్మీనారాయణ, యూత్ అధ్యక్షుడిగా బొర్ర నరేశ్ పటేల్, ఉపాధ్యక్షులుగా దఫేదార్ విజయ్‌కుమార్, శీలం సాయిలు, ప్రధాన కార్యదర్శిగా కలకొండ నారాయణ, జాయింట్ సెక్రటరీలుగా వెల్లుట్ల. సాయిలు, బిట్ల అశోక్, కోశాధికారిగా కలకొండ సిద్దిరాములు, కార్యవర్గ సభ్యులుగా పెరుగు బాలకిషన్, లింగాల నరేందర్, మాలీస్ రాజు, మండల కోఆర్డినేటర్‌గా గాండ్ల రవీందర్‌లను ఎన్నుకున్నారు.

నాణ్యతతో నిర్మించాలి



పెద్దకొడప్‌గల్(జుక్కల్): ఇందిరమ్మ మోడల్ ఇళ్ల నాణ్యతతో నిర్మించాలని ఎంపీడీవో లక్ష్మీకాంత్ రెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్మిస్తున్న మోడల్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఎంపీడీవో పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల పరిశీలన

రాజంపేట: మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూం ఇళ్లను శుక్రవారం పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఎక్జిక్యూటివ్ ఇంజినీర్, క్వాలిటీ కంట్రోలర్ శైవేందర్ రాథోడ్, డీఈ ప్రభు, ఏఈ మేఘనలు పరిశీలించారు. కాంట్రాక్టర్ రాధాకృష్ణను పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. మౌలిక వసతుల కోసం ప్రభుత్వం రూ.53 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. త్వరలోనే పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను అధికారులు ఆదేశించారు.

నాణ్యమైన సరుకులను వినియోగించాలి



ఎల్లారెడ్డి: మధ్యాహ్న భోజనంలో నాణ్యమైన సరుకులు వినియోగించేలా ప్రధానోపాధ్యాయులు చూడాలని ఎంఈవో వెంకటేశం అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. తహసీల్దార్ మహేందర్‌కుమార్, ఎంపీడీవో లక్ష్మి, ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, రాజులు, గాంధీ తదితరులున్నారు.

షట్టర్ల కోసం దరఖాస్తులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్ ఎల్లారెడ్డి సింగిల్ విండో కార్యాలయం పరిధిలోని నాలుగు షట్టర్‌లను అద్దెకు ఇవ్వనున్నట్లు విండో సీఈవో భైరయ్య తెలిపారు. ఈ నాలుగు షట్టర్లకు నలుగురి కంటే ఎక్కువ మంది ఆశావహులు వస్తే లాటరీ ద్వారా ఎంపిక చేస్తామన్నారు. ఒక్కో షట్టర్‌కు రూ.1,500(3 పెద్దవి),చిన్న షట్టర్‌కు రూ.1200 ధర నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నెల 8లోగా విండో కార్యాలయంలో షట్టర్‌కు రూ.500 చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. 10న ఎంపిక ప్రక్రియ పూర్తి అవుతుందన్నారు.

నులి పురుగుల నివారణపై అవగాహన

లింగంపేట(ఎల్లారెడ్డి): స్థానిక పీహెచ్‌సీలో శుక్రవారం నులి పురుగు నివారణపై వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలకు పీహెచ్‌సీ వైద్యులు హిమబిందు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పాఠశాలల్లో ఒక ఏడాది వయసు నుంచి 19 ఏళ్ల వరకు ఉన్న బాలబాలికలకు మాత్రలు వేయాలన్నారు. 6,553 మంది బాలురు, 6,725 మంది బాలికలకు సోమవారం నుంచి వేయాలన్నారు. సంవత్సరం నుంచి 2 సంవత్సరాల పిల్లలకు సగం మాత్ర, రెండు నుంచి 19 సంవత్సరాల వారికి ఒక మాత్ర వేయాలని సూచించారు. వైద్య సిబ్బంది యాదగిరి, ప్రదీప్, చంద్రకళ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైద్యులు హిమబిందు

కంటివైద్య శిబిరం

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించినట్లు ఆప్తాల్మిక్ ఆఫీసర్ హరికిషన్ తెలిపారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపి

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపి క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఈఆర్‌పీ కమల్ కిశోర్ మాట్లాడారు. వైద్యురాలు సారిక 9 మంది దివ్యాంగ చిన్నారులను పరీక్షించారు. ఇంటి వద్ద చేయించే వ్యాయామాల గురించి దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేశారు.

పల్లెప్రకృతి వనం కనుమరుగు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): గ్రామాల్లో మొక్కలు నాటాలని, పల్లెల్లో పచ్చదనం వెల్లివిరియాలనే ఉద్దేశంతో ప్రతి గ్రామంలో పల్లె ప్రకృతివనాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో ప్రకృతి వనాల పర్యవేక్షణను గ్రామ పంచాయతీలకు అప్పగించింది. కానీ మల్లుపేట్ గ్రామ స్టేజీ వద్ద గల పెద్దమ్మ ఆలయ ప్రాంగణంలో పల్లెప్రకృతి వనాన్ని నిబంధనలకు విరుద్ధంగా గుర్తుతెలియని వ్యక్తులు పూర్తిగా తొలగించారు. పల్లెప్రకృతి వనం అని పేరు ఉన్న బోర్డుకు రంగును దిద్దారు. ఆలయ ప్రాంగణంలో ఒక్క మొక్క లేకుండా చేశారు. ఈ విషయమై ఎంపీవో సురేందర్ రెడ్డిని వివరణ కోరగా.. పంచాయితీ కార్యదర్శికి తెలిపామని, విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

యూడైస్‌లో సాఫ్ట్‌వేర్ సమస్యలను పరిష్కరించాలి



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో శుక్రవారం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు గురుకుల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో దేవిసింగ్ మాట్లాడుతూ.. యూడైస్‌లో డాటా క్యాప్చర్ ఫార్మాట్ ఎర్రర్‌లను అప్డేట్ చేయడంతో పాటు వివిధ సమస్యలను పరిష్కరించాలన్నారు. మండల నోడల్ అధికారి రమణ రావు మాట్లాడుతూ.. నులి పురుగులు దినోత్సవం పాఠశాలలో నిర్వహించాలని సూచించారు. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు హరి సింగ్, అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

ఆక్సిజన్ పార్కుకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండల కేంద్రంలోని శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ నేషనల్ రూర్బన్ మిషన్ ఆక్సిజన్ పార్కును శుక్రవారం బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి సందర్శించారు. నిర్లక్ష్యం నీడన ఆక్సిజన్ పార్కు అంటూ గురువారం సాక్షి దినపత్రికలో వచ్చిన కథనానికి సబ్ కలెక్టర్ స్పందించారు. ఆక్సిజన్ పార్కులో నీళ్లు లేక వాడిపోతున్న చెట్లు, చెత్తాచెదారాన్ని పరిశీలించారు. పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఆట పరికరాలకు మరమ్మతులు చేపట్టి ఉపయోగంలోకి తీసుకురావాలని స్థానిక అధికారులను ఆమె ఆదేశించారు. ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ హిమబిందు, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ తదితరులున్నారు.


పార్కును పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

విద్యార్థుల సామర్థ్యం మెరుగుపర్చాలి

నస్రుల్లాబాద్(బాన్సువాడ): విద్యార్థుల సామర్థ్యం మెరుగు పర్చాలని మండల ప్రత్యేక అధికారి దయానంద్ అన్నారు. శుక్రవారం రాములగుట్ట తండా గ్రామ పంచాయతీ, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, గ్రామ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో ఆయన మాట్లాడారు. చదవడం రాయడంలో విద్యార్థులు వెనకపడి ఉన్నారన్నారు. వారిని చదువులో మెరుగు పరచాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో పాల్గొని పలు సూచనలిచ్చారు.




ఆధ్యాత్మికం

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



బీబీపేట: మండల కేంద్రంలో వాసవీ కన్యకాపరమేశ్వరి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం విగ్రహాల ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ఉత్సవాలు



దోమకొండ: మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవాల్లో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు. అర్చకులు, ఆలయ కమిటీ ప్రతినిధులు శాలువా కప్పి స్వాగతం పలికారు.

మల్లికార్జున స్వామి కల్యాణం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): బ్రహ్మాజీవాడి శివారులో నూతనంగా నిర్మించిన ఆలయంలో శుక్రవారం మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. కల్యాణోత్సవానికి మాజీ ఎమ్మెల్యేలు జాజాల సురేందర్, బాజిరెడ్డి గోవర్ధన్‌లు హాజరు కాగా.. ఆలయ కమిటీ సభ్యులు సన్మానం చేశారు.

పెద్దమ్మ–పెద్దిరాజుల కల్యాణం



భిక్కనూరు: అంతంపల్లిలో ముదిరాజు సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ–పెద్దిరాజుల కల్యాణాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కట్నకానుకలను సమర్పించుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు.

నేటి నుంచి ఎల్లమ్మ ఆలయ 49వ వార్షికోత్సవాలు

భిక్కనూరు: మండల కేంద్రంలోని రేణుకాదేవి ఎల్లమ్మ ఆలయ 49వ వార్షికోత్సవాలను నేటి(శనివారం) నుంచి 12 వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు గౌడ సంఘం ప్రతినిధులు తెలిపారు. అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావల్సిందిగా వారు కోరారు.

సంక్షిప్తం

సబ్సిడీ రుణాలు ఇప్పించండి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు, ఇందిరమ్మ గృహాలు అర్హులైన మాల మాదిగలకు ఇప్పించాలని కోరుతూ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతంను శుక్రవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసినట్లు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మద్దెల బాగయ్య తెలిపారు.ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరారు.

సెలవుదినంగా ప్రకటించాలి

ఎల్లారెడ్డి: సేవాలాల్ జయంతిని ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించాలని లంబాడి ఐక్యవేదిక జిల్లా యూత్ ఇన్‌చార్జి అనిల్ నాయక్ శుక్రవారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సేవాలాల్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నప్పటికి, ఇదే రోజున సెలవు దినంగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.

రక్తదాత బాలుకు జయజయసాయి ట్రస్ట్ పురస్కారం

కామారెడ్డి అర్బన్: ఇప్పటికి 75సార్లు రక్తదానం చేసిన ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, కామారెడ్డి రక్తదాతల సమూహం వ్యవస్థాపకులు ఎన్.బాలుకు గుంటూరు జిల్లా చిలకలూరిపేట జయజయసాయి ట్రస్ట్ శ్రీసాయిసేవా భగవాన్ జాతీయ ఉత్తమ సేవా పురస్కారం ప్రకటించింది. ఈ మేరకు ట్రస్ట్ వ్యవస్థాపకులు, అధ్యక్షుడు డాక్టర్ పూసపాటి బాలాజీ వర్తమానం పంపారు. రక్తదానం చేయడంతో పాటు బాధితులకు దాతల సహకారంతో రక్తం అందిస్తున్నందుకు గానూ పురస్కారానికి ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఆదివారం చిలకలూరిపేటలో పురస్కారం అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

కల్యాణ మండప నిర్మాణ పనులు ప్రారంభం

దోమకొండ: మండల కేంద్రంలోని మార్కండేయ మందిరంలో కల్యాణ మండప నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి సొంత నిధులతో పనులను ప్రారంభించగా, పద్మశాలి సంఘం అధ్యక్షుడు మ్యాక నాగరాజు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. నెల రోజుల్లో పనులు పూర్తవుతాయని తెలిపారు. సంఘం కోశాధికారి గణేష్, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డి, బీజేపీ మండల యువజన అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల్లో మొక్కలను సంరక్షించాలి

దోమకొండ: నర్సరీల్లోని మొక్కలను సంరక్షించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు అంచనూర్, గ్రామాల్లోని నర్సరీలను ఆయన పరిశీలించారు. పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఈజీఎస్ ఏపీవో రజనీ, టెక్నికల్ అసిస్టెంట్లు లింగం, రాజేశ్వర్, కార్యదర్శులు యాదగిరి, లింగం ఉన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన ఉండాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మహిళా చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని షీటీం కానిస్టేబుల్ శ్రీనివాస్ సూచించారు. గోపాల్‌పేటలో శుక్రవారం షీటీం ఆధ్వర్యంలో సైబర్‌నేరాలు, మహిళా చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల రక్షణ కోసమే ప్రభుత్వం షీటీంలను ఏర్పాటు చేసిందన్నారు. సోషల్‌మీడియాలో, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాంలలో గుర్తుతెలియని వ్యక్తులతో చాటింగ్ చేయవద్దన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు ఖాతా వివరాలు గానీ, ఓటీపీగాని అడిగితే చెప్పవద్దన్నారు.